



# చార్జీలు పెంచిన టెల్కోలు

## 21 శాతం వరకు సవరించిన ఎయిర్‌టెల్

## వొడాఫోన్ ఐడియా 24 శాతం వరకు పెంపు

న్యూఢిల్లీ, జూన్ 28: మొబైల్ సబ్‌స్క్రైబర్లకు టెలికం సంస్థలు వరుసగా షాకిస్తున్నాయి. ఇప్పటికే టెలికం దిగ్గజం రిలయన్స్ జియో తమ టారిఫ్ చార్జీలను పెంచగా.. తాజాగా ఇదే జాబితాలోకి భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలు కూడా చేరాయి. ఈ రెండు సంస్థలు కూడా తమ ప్లాన్ల ధరలను కూడా పెంచుతున్నట్లు శుక్రవారం ప్రకటించాయి. ఎయిర్‌టెల్ చార్జీలు వచ్చే నెల 3 నుంచి అమలులోకి రానుండగా, అదే వొడాఫోన్ ఐడియా చార్జీలు మాత్రం జూలై 4 నుంచి అమలులోకి రానున్నాయి.

**ఎయిర్‌టెల్ చార్జీలు వివరంగా..**

- వచ్చే నెల 3 నుంచి అమలులోకి వచ్చేలా అన్ని రకాల ప్లాన్ల ధరలను 10–21 శాతం వరకు సవరించింది.
- రోజువారి డాటా 1జీబీపై చార్జీని రూ.3 పెంచింది. దీంతో ధర రూ.19 నుంచి రూ.22కి చేరుకున్నది.
- 365 రోజుల కాలపరిమితితో రోజుకు 2జీబీ డాటా ప్లాన్‌ను రూ.600 పెంచింది. దీంతో ఈ ప్లాన్ ధర రూ.2,999 నుంచి రూ.3,599కి చేరుకున్నది.
- అన్‌లిమిటెడ్ వాయిస్ ప్లాన్ టారిఫ్‌లను 11 శాతం వరకు పెంచింది. దీంతో 28 రోజుల కాలపరిమితితో 2జీబీ డాటా ప్లాన్ చార్జీని రూ.179 నుంచి రూ.199కి సవరించింది.
- 56 రోజుల కాలపరిమితితో రోజుకు 1.5 జీబీ డాటా ప్లాన్‌ను రూ.479 నుంచి రూ.579కి పెంచింది.
- అలాగే 28 రోజుల కాలపరిమితితో రోజుకు ఒక్క జీబీ డాటా ప్లాన్ చార్జీని రూ.265 నుంచి రూ.299కి, 1.5 జీబీ డాటా ప్లాన్‌ని రూ.299 నుంచి రూ.349కి పెంచింది.
- 84 రోజుల వ్యాలిడిటీ ప్లాన్‌ను రూ.140 పెంచింది. రోజుకు 1.5 జీబీ డాటా ప్లాన్ చార్జీ రూ.719 నుంచి రూ.859కి, రోజుకు 2 జీబీ డాటా ప్లాన్ రూ.839 నుంచి రూ.979కి చేరుకున్నాయి.
- అలాగే పోస్ట్ పెయిడ్ రేట్లను కూడా 10–20 శాతం వరకు వడ్డించింది.

**వొడాఫోన్ ఐడియా కూడా..**

నష్టాల్లో నడుస్తున్న వొడాఫోన్ ఐడియా కూడా టారిఫ్ చార్జీలను పెంచుతున్నట్లు ప్రకటించింది. వచ్చే నెల 4 నుంచి అమలులోకి వచ్చేలా చార్జీలను 11 శాతం నుంచి 24 శాతం వరకు సవరించింది. ఎంట్రీ–లెవల్ ప్లాన్ కనీస చార్జీని 11 శాతం పెంచడంతో ఈ ప్లాన్ ధర రూ.179 నుంచి రూ.199కి చేరుకున్నది. అలాగే ప్రజాదరణ పొందిన 84 రోజుల కాలపరిమితి ప్లాన్‌ని రూ.719 నుంచి రూ.859కి పెంచింది. మరోవైపు రూ.2,899 వార్షిక ప్లాన్ చార్జీని 21 శాతం పెంచడంతో రూ.3,499కి చేరుకున్నది.

# బీఎస్‌డీఏ పరిమితి రూ.10 లక్షలు: సెబీ

న్యూఢిల్లీ, జూన్ 28: సెక్యూరిటీల మార్కెట్‌లో చిన్న మదుపరుల భాగస్వామ్యాన్ని పెంచేందుకు మార్కెట్ రెగ్యులేటర్ సెబీ.. బేసిక్ సర్వీస్ డీమ్యాట్ అకౌంట్ (బీఎస్‌డీఏ) పరిమితిని శుక్రవారం రూ.10 లక్షలకు పెంచింది. ప్రస్తుతం ఇది రూ.2 లక్షలుగానే ఉండటం గమనార్హం. రెగ్యులర్ డీమ్యాట్ ఖాతాకు మరింత సరళతరమైన వెర్షనే ఈ బీఎస్‌డీఏ. చిన్న పోర్ట్‌ఫోలియోలతో ఉన్న మదుపరులపై డీమ్యాట్ చార్జీల భారాన్ని తగ్గించాలని 2012లో దీన్ని సెబీ పరిచయం చేసింది. అన్ని డిపాజిటరీల్లో ఇన్వెస్టర్‌కు ఒక్క డీమ్యాట్ ఖాతానే ఉండాలని, రుణ–రుణేతర సెక్యూరిటీల్లో సెక్యూరిటీల విలువ రూ.10 లక్షలు దాటరాదన్న నిబంధనలు దీనికి వర్తిస్తాయి. అలాగే సెక్యూరిటీల విలువ రూ.4 లక్షలలోపుంటే వార్షిక నిర్వహణ చార్జీలుండవు. రూ.4–10 లక్షల మధ్య ఉంటే రూ.100 చెల్లించాలి. ఈ క్రమంలోనే విలువ రూ.10 లక్షలు దాటితే ఆటోమేటిగ్గా రెగ్యులర్ డీమ్యాట్ ఖాతాగా మారిపోతుంది. ఇక రెగ్యులర్ డీమ్యాట్ ఖాతాను ఖాతాదారుడే ఈ–మెయిల్ ద్వారా తెరుచుకోవచ్చు. కానీ బీఎస్‌డీఏను అర్హులైన ఖాతాదారుల కోసం డిపాజిటరీ పార్టిసిపెంట్సే తెరుస్తారని సెబీ చెప్పింది. బీఎస్‌డీఏ ఖాతాదారులకు ఎలక్ట్రానిక్ స్టేట్‌మెంట్లు ఉచితం. భౌతికంగా స్టేట్‌మెంట్లు కావాలంటే ఒక్కోదానికి రూ.25 చెల్లించాలి. సెప్టెంబర్ 1 నుంచి కొత్త మార్గదర్శకాలు అమల్లోకి వస్తాయని సెబీ తెలియజేసింది.

# సూచీల రికార్డులకు బ్రేక్


## సెన్సెక్స్ 210, నిఫ్టీ 34 పాయింట్లు డౌన్

ముంబై, జూన్ 28: స్టాక్ మార్కెట్ల వరుస ర్యాలీకి బ్రేక్‌పడింది. పెట్టుబడిదారులు ప్రాఫిట్ బుకింగ్‌కు మొగ్గుచూపడంతో ఒక దశలో రికార్డు స్థాయిలో దూసుకెళ్లిన సూచీలు చివర్లో నష్టాల్లోకి జారుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లు ఆశాజనకంగా ఉన్నప్పటికీ బ్యాంకింగ్, ఆర్థిక, టెక్నాలజీ షేర్లు తీవ్ర ఒత్తిడికి గురికావడంతో గత నాలుగు రోజుల ర్యాలీకి బ్రేక్‌పడినట్లు అయిందని దలాల్‌స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి. ఒక దశలో 428 పాయింట్లు పెరిగి మరో చారిత్రక గరిష్ఠ స్థాయి 79,671.58 పాయింట్లను తచ్చాడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్..చివరకు వారాంతం ట్రేడింగ్ ముగిసే సరికి 210.45 పాయింట్ల నష్టంతో 79,032.73 వద్ద నిలిచింది. మరో సూచీ నిఫ్టీ సైతం 33.90 పాయింట్లు కోల్పోయి 24,010.60 వద్ద స్థిరపడింది.



బ్యాంకింగ్ రంగ సూచీల్లో అత్యధికంగా ప్రాఫిట్ బుకింగ్ జరగడం వల్లనే సూచీలు నష్టాల్లోకి జారుకున్నాయి. తీవ్ర ఒడిదుడుకుల మధ్య ట్రేడైన సూచీలు చివర్లో నష్టపోయాయి. చివరి అరగంటలో మదుపరులు అమ్మకాల బటన్ నొక్కారు.

**- ప్రశాంత్ తాప్సీ, మెహతా ఈక్విటీస్ లిమిటెడ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్**



- గత నాలుగు సెషన్లలో సెన్సెక్స్ 2,033.28 పాయింట్లు లేదా 2.63 శాతం పెరిగింది. మొత్తంమీద ఈ వారంలో సూచీ 1,822.83 పాయింట్లు(2.36 శాతం), నిఫ్టీ 509.5 పాయింట్లు (2.16 శాతం) చొప్పున పెరిగాయి.
- జూన్ నెలలో సెన్సెక్స్ 7.14 శాతం మేర పెరిగినట్లు అయింది.
- దీంతో బీఎస్‌ఈలో లిస్టైన కంపెనీల మార్కెట్ విలువ రికార్డు స్థాయి రూ.439.24 లక్షల కోట్ల(5.26 ట్రిలియన్ డాలర్లు)కి చేరుకున్నది.
- రిలయన్స్, టాటా మోటర్స్, ఏషియన్ పెయింట్, నెస్లే, టైటాన్, ఎస్బీఐ, హెచ్‌యూఎల్, సన్‌ఫార్మా, ఎన్‌టీపీసీ, హెచ్‌సీఎల్ టెక్నాలజీ రంగ షేర్లు భారీగా లాభపడ్డాయి.
- మరోవైపు, ఇండస్‌ఇండ్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, కొటక్ బ్యాంక్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, మారుతి షేర్లు ఒక్క శాతానికి పైగా నష్టపోయాయి.
- వీటితోపాటు బజాజ్‌ఫిన్ సర్వ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, టీసీఎస్, మహీంద్రా, అదానీ పోర్ట్స్, అల్ట్రాటెక్ సిమెంట్, ఎల్‌అండ్‌టీ, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, టాటా స్టీల్, ఐటీసీ షేర్లు కూడా నష్టపోయాయి.
- రంగాలవారీగా చూస్తే బ్యాంకింగ్ సూచీ అత్యధికంగా ఒక్క శాతానికి పైగా కోల్పోయింది. ఆ తర్వాత టెలికం, ఆర్థిక సేవలు, టెక్ సూచీలు నష్టపోగా.. హెల్త్‌కేర్, ఎనర్జీ, మెటల్, ఆయిల్ అండ్ గ్యాస్ రంగ షేర్లు లాభాల్లో ముగిశాయి.

### 21 లక్షల కోట్లకు రిలయన్స్ మార్కెట్ విలువ

*గత కొన్ని రోజులుగా రిలయన్స్ షేరు రాకెట్ వేగంతో దూసుకుపోతున్నది. శుక్రవారం కూడా కంపెనీ షేరు 2 శాతానికి పైగా లాభపడటంతో మార్కెట్ విలువ రూ.21 లక్షల కోట్లు అధిగమించింది. హెవీవెయిట్ సూచీ అయిన రిలయన్స్ షేరు 2.31 శాతం లాభపడి రూ.3,131.85 వద్ద ముగిసింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.47,777.57 కోట్లు పెరిగి రూ.21,18,951.20 కోట్లకు చేరుకున్నది. 30 షేర్ల ఇండెక్స్ సూచీల్లో అత్యధికంగా లాభపడిన షేరు ఇదే కావడం విశేషం.*




# ఎన్‌పీఎస్ ఖాతాదారులకు ఉత్సాహం

## జూలై 1 నుంచి T+0కు పీఎఫ్‌ఆర్డీఏ గ్రీన్‌సిగ్నల్

న్యూఢిల్లీ, జూన్ 28: నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్) ఖాతాదారుల కోసం T+0 సెటిల్మెంట్‌ను పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్‌ఆర్డీఏ) అనుమతించింది. జూలై 1 నుంచి ఇది అమల్లోకి వస్తుంది. ఏదైనా సెటిల్మెంట్ రోజున ఉదయం 11 గంటల వరకు ట్రస్టీ బ్యాంక్ ద్వారా ఎన్‌పీఎస్ విరాళాలు అందినట్టైతే.. అదే రోజున (T+0) వాటిని పెట్టుబడిగా పెట్టడం జరుగుతుందని, అంతేగాక ఖాతాదారుల నికర ఆస్తి విలువ (ఎన్ఏవీ)కు కూడా దాని ప్రయోజనాన్ని జత చేస్తామని పీఎఫ్‌ఆర్డీఏ ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. ఇప్పటి దాకా ట్రస్టీ బ్యాంక్.. సెటిల్మెంట్ జరిగిన తర్వాతి రోజున (T+1) అందిస్తున్నది. ఉదాహరణకు సోమవారం పనివేళలు ముగిసే దాకా వచ్చిన విరాళాలు.. మంగళవారం ట్రస్టీ బ్యాంక్ ద్వారా పెట్టుబడులకు వీలుగా అందుతున్నాయి. కానీ ఇకపై విరాళాలు గనుక ఉదయం 11 గంటలలోపు వస్తే.. అదే రోజున ట్రస్టీ బ్యాంక్ అందిస్తుందని పీఎఫ్‌ఆర్డీఏ తెలియజేసింది. దీంతో పెట్టుబడులు వెంటనే జరిగిపోతాయన్నది. ఇదిలావుంటే ప్రస్తుతం డీ–రెమిట్ విరాళాలను సెటిల్మెంట్ రోజు ఉదయం 9:30లోగా అందితేనే.. అదే రోజున ఇన్వెస్ట్ చేయడం జరుగుతున్నది. దీంతో ఈ సమయాన్ని కూడా ఉదయం 11 గంటలకు పొడిగించారు. పాయింట్స్ ఆఫ్ ప్రజెన్స్, నోడల్ ఆఫీసులు, ఈ–ఎన్‌పీఎస్ కోసమున్న ఎన్‌పీఎస్ ట్రస్ట్ సలహా మేరకే పీఎఫ్‌ఆర్డీఏ ఈ మార్పులను చేసింది.




**సమతుల లైఫ్–సైకిల్ ఫండ్**

రాబోయే జూలై–సెప్టెంబర్ త్రైమాసికానికిగాను తమ పోర్ట్‌ఫోలియోలో మరింత ఈక్విటీ కేటాయింపులను కోరుకుంటున్న వారి కోసం ఓ సమతుల లైఫ్–సైకిల్ ఫండ్‌ను ప్రారంభించే యోచనలో పీఎఫ్‌ఆర్డీఏ ఉన్నది. ఇప్పటికే పెన్షన్ ఫండ్ రెగ్యులేటర్ చైర్‌పర్సన్ దీపక్ మొహంతీ ఈ మేరకు సంకేతాలు కూడా ఇచ్చారు. వ్యక్తిగత రిటైర్మెంట్ నిధిలో మరిన్ని నిల్వలను పోగేసేందుకు ఇది దోహదం చేయగలదన్నారు. లైఫ్–సైకిల్ ఫండ్స్ అనేవి అసెట్ అలొకేషన్ ఫండ్స్. తక్కువ రిస్కునుబట్టి ఆటోమేటిక్‌గా ప్రతీ అసెట్ క్లాస్‌కు ఇవి నిధులను షేర్ చేస్తాయి. ప్రస్తుతం ఎన్‌పీఎస్ రెండు అవకాశాలను ఇస్తున్నది. అందులో ఒకటి యాక్టివ్, మరొకటి ఆటో. పెన్షన్ పోర్ట్‌ఫోలియోల సృష్టి కోసం ఎన్‌పీఎస్ ఖాతాదారులు వీటిని వినియోగించుకోవచ్చు.

### కీలక రంగాల్లో 6.3% వృద్ధి

న్యూఢిల్లీ, జూన్ 28: కీలక రంగాల్లో వృద్ధి అంతంత మాత్రంగానే నమోదైంది. మే నెలకుగాను ఈ రంగాల్లో వృద్ధి 6.3 శాతంగా ఉన్నది. ఏడాది క్రితం ఇదే నెలలో నమోదైన 5.2%తో పోలిస్తే పెరగగా, అదే ఈ ఏప్రిల్‌లో నమోదైన 6.7%తో పోలిస్తే తగ్గింది. బొగ్గు, సహజ వాయువు, విద్యుత్ రంగాలు అంచనాలకుమించి రాణించడంతో ఈ మాత్రమైన వృద్ధిని సాధించాయి.

### చిన్న మొత్తాలపై వడ్డీరేట్లు యథాతథం

న్యూఢిల్లీ, జూన్ 28: వివిధ చిన్న మొత్తాల పొదుపు పథకాలపై వడ్డీరేట్లు జూలై 1 నుంచి మొదలయ్యే త్రైమాసికంలోనూ యథాతథంగానే ఉంటాయని కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ప్రకటించింది. 'ఈ ఆర్థిక సంవత్సరం (2024–25) రెండో త్రైమాసికం (జూలై–సెప్టెంబర్)లోనూ ఆయా చిన్నమొత్తాల పొదుపు పథకాలపై వడ్డీరేట్లలో ఎలాంటి మార్పుండదు' అని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఓ అధికారిక ప్రకటన విడుదల చేసింది. ప్రతీ మూడు నెలలకోసారి పోస్టాఫీస్, బ్యాంకుల్లోని స్మాల్ సేవింగ్స్ స్కీంలపై వడ్డీరేట్లను సమీక్షించి కేంద్రం ఓ నిర్ణయాన్ని ప్రకటిస్తుందన్న విషయం తెలిసిందే. కాగా, ప్రస్తుతం సుకన్య సమృద్ధి స్కీంలో డిపాజిట్లపై 8.2 శాతం వడ్డీ వస్తున్నది. మూడేండ్ల టర్మ్ డిపాజిట్‌పై వడ్డీరేటు 7.1 శాతంగా ఉన్నది. పీపీఎఫ్‌పై 7.1 శాతం, పోస్టాఫీస్ సేవింగ్స్ డిపాజిట్లపై 4 శాతం వడ్డీరేట్లున్నాయి. కిసాన్ వికాస్ పత్రలో 7.5 శాతం వడ్డీరేటున్నది. 115 నెలలకు పెట్టుబడులు మెచ్యూర్ అవుతాయి. ఇక నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్‌పై 7.7 శాతం, నెలవారీ ఆదాయ పథకంపై 7.4 శాతం వడ్డీరేటునిస్తున్నారు.

### టాటా ఏఐజీ వర్షాకాల బీమా

ముంబై, జూన్ 28: ప్రముఖ బీమా సంస్థ టాటా ఏఐజీ.. ఈ వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని వాహనదారుల కోసం ఓ సమగ్ర మోటర్ ఇన్సూరెన్స్‌ను తీసుకొచ్చింది. ముంపు ప్రాంతాల్లోని వాహన యజమానులకు ఈ బీమా ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని సంస్థ తెలిపింది. వరదనీరు వల్ల వాహనాలకు వాటిల్లే నష్టాలను ఈ బీమా సాయంతో జయించవచ్చని పేర్కొన్నది. మరింత సమాచారం కోసం వాహనదారులు www. tataaig.comను సందర్శించవచ్చు.

